స్కెచ్

# ఆమె కోరిక

"జ్యేష్ఠ"

"వస్తూ పోతూ ఉంటేనే బంధుత్వాలు. నువ్వింకా చిన్నపిల్లవి. నీకు తెలియదు తల్లీ."

"బంధుత్వంట, బంధుత్వం! అది లేకపోతే నష్టం ఏఁవొచ్చిందో!"

"ఆ బాంధుత్వం ఈనాటిదికాదు. ఏడుతరాల నాటిది. తెలుసా!"

"అంత పాతది కనుకనే ఇప్పుడు లేకపోయినా ఫరవాలేదంటాను." లత గబగబా అనేసి విసురుగా తన గదిలోకి వెళ్ళిపోయింది. గడియారం ఎనిమిది కొట్టింది. ట్యూబ్‌లైట్ చుట్టూ మూగిన జీవాలు ఉత్సాహంగా ఎగురుతున్నాయి. రంగారావు తల రెండు చేతులతోనూ పట్టుకొని గట్టిగా నిట్టూర్చాడు. "పెంకిపిల్ల! అది ఎంతఅనుకుంటే అంతే."

"దానికంత ఇష్టం లేకపోతే బలవంతాన ఒప్పించడం ఎందుకు? పోన్లెండి మానేద్దాం" సుబ్బమ్మ లత గదివేపు చూస్తూ అంది.

"శుభలేఖ కాకుండా ఉత్తరం కూడా వ్రాశాడు — 'స్వయంగావచ్చి పిలవలేనందుకు ఎంతో విచారిస్తున్నాను' అని. వెళ్ళకపోతే బావుండదు. బంధుత్వానికి అది చెప్పినట్టు కాలదోషం పట్టిందనుకున్నా వాళ్ళిద్దరూ కాలేజీ స్నేహితులే కదా!"

"నాలుగు రోజుల్నుంచీ దాని ఒంట్లో ఏం బావుండటంలేదు. నీరసంగా ఉంటోంది. అటువంటప్పుడు దూరప్రయాణంచేస్తే ... అదన్నట్లు విశాఖపట్నం నుంచి బెజవాడ నానాయాతనా పడాలి." సుబ్బమ్మ అనేసి ఆవలించేసింది. అది ఆవిడ ఉపన్యాసానికి ఆఖరు—ఆయన మరి వాదించి లాభంలేదని సూచన. ఆయన ముఖంలో వ్యథ స్పష్టంగా గోచరిస్తోంది.

* * *

రెండోఆట సినిమానుంచి వస్తూకూడా జనం జోరీగల్లా మాట్లాడేస్తున్నారు. చాలా మంది తిండి లేకపోయినా ఉండగలరు గాని తెగవాగకపోతే ఉండలేదు. లత గదిలో లైటు మౌనంగా చూస్తోంది లతకేసి.

శుభలేఖలోంచి తొంగిచూసే శేఖర్—శుభలేఖలోకి తీవ్రంగా చూసే లత...అమాయకంగా శేఖర్ పక్కని నవ్వుతున్న 'రేఖ'...శేఖర్ ధోరణి చూస్తే రేఖని క్రీగంట చూస్తున్నట్టు ఉంది. చూస్తాడు, చూస్తాడు-చూడకేం చేస్తాడు! 'రేఖ' చాలా అందంగా ఉంది మరి. గోడమీద ఉన్న కాలేజీ ఫోటోలోనూ ఉన్నాడు శేఖర్—లత కేసి చూస్తూ... కాని ఐదేళ్ళ క్రితం.

లతతలచుట్టూ ప్రదక్షిణంచేస్తోంది దోమ-దోమ సంగీతం అంతులేని గీతం. అపశ్రుతులు లేని గీతం.

"నీకోసం జీవిస్తాను. విధిని ఎదిరిస్తాను, నీ చిరునవ్వు కోసం" అన్నాడు శేఖర్. అప్పుడు తను ఏమంది, "ప్రస్తుతం పరీక్షలు చూద్దాం, పరుగెత్తుకొస్తున్నాయి!" శేఖర్ నవ్వాడు ఎవరికోసమో గాని. శేఖర్‌కి కాలేజీ ఫస్టువచ్చింది. తను మురిసిపోయింది. శేఖర్ తనదగ్గరికి వచ్చాడు; "లతా! నీకోసం, నీ చిఱునవ్వులకు ప్రతిఫలంగా" అన్నాడు. అతని ప్రైయిజులన్నీ తన చేతిలో పెడుతూ, "ఇప్పుడు కాదు" అంది తను.

యూనివర్సిటీకి ప్రయాణంకట్టాడు శేఖర్. ఆ రోజున రైలు కదులుతూంటే అతను తనవేపు ఎలా చూశాడు! "చదువు అయిపోయాక మన పెళ్ళి" అన్నాడు. అతన్నిగురించి కలలుగంటూ గడిపింది తను. ఐదు సంవత్సరాల తర్వాత వికసించే ఆశాపుష్పం.

మాడిపోయింది, పైగా ముళ్ళు గుచ్చుకున్నాయి. తను అందంగా ఉంటుంది. రేఖ మరీ అందంగా ఉంటుంది. తనని ప్రేమించాడు శేఖర్. రేఖనీ ప్రేమించాడా?

"అబ్బే ప్రేమకాదది—మో...జు."

ఏమో ప్రేమించాడేమో. తనని మరచిపోయాడేమో!

"ప్రేమలో మొదటి ప్రేమ, రెండో ప్రేమా అని ఉండదు. ప్రేమించడం ఒక్కమారే. జీవితంలో ఒక్కసారే. ఒకడు ఒక్కతెనే"

తను ఎదురుగా ఉంటే! శేఖర్ రేఖవేపు చూసి ఉండేవాడా?

"చూస్తాడు. చూడకేంచేస్తాడు. నేను సూర్యుడి ముందు దివిటీలా ఉంటాను."

"కాదు. నన్ను అంత ప్రేమించి మరొక ఆమెను చూస్తాడా నేను ఎదురుగా ఉన్నప్పుడు! చూడడు."

తనే శేఖర్ ఎదురుగా ఉంటే రేఖ అందం విఫలమయ్యేది.

"కావచ్చు కాని చేతులు కాలేయి. ఇప్పుడు ఆకుల్ని గురించి ఆలోచించడం ఎందుకు!"

అతనిప్పుడు తనని చూస్తే...

"తెల్లబోతాడు"

అంతేనా?

అతని మనశ్శాంతి నశిస్తుంది పైకిమామూలుగా ఉన్నా.

"అతను పశ్చాత్తాప పడతాడు. నా గురించిన ఆలోచన అతనిలో అశాంతిని కలుగజేస్తుంది."

అతని పరిస్థితి బలేచిక్కులలో పడుతుంది.

"మెత్తని ఆకుల అడుగున దాగిన ముళ్ళు గుచ్చుకున్నట్టు చక్కగా ఉంటుంది!"

తను అతని ముఖాన్ని పరీక్షిస్తుంది, అతని ఆందోళనని గమనించి లోలోపల ఆనందిస్తుంది. అతన్ని తనని గురించిన ఆలోచన వెంటాడుతూనే ఉంటుంది. తన పగ తీరుతుంది ..

కెరటాల అడుగునుంచి నల్లరాళ్లు బైటపడుతున్నట్టు, ఇళ్ళన్నీ చీకట్లోంచి లేస్తున్నాయి. నల్లని నీడలవెనుక ఆకాశం పాలిపోయినట్లు కనిపిస్తోంది. లతకళ్ళు ఎర్రబడి పోయాయి. వర్షాకాలపు కాలమేఘాల్లో ఆమె కనురెప్పలు బరువెక్కాయి.

"అమ్మా! బెజవాడ వెడదామే" గోముగా అంది. అప్పుడే లేచిన తల్లితో. ఆవిడ ఆశ్చర్య పడింది. "సరేలే" అంది. లత గదిలోకివచ్చి సుఖంగా నిద్రపోయింది.

* * *

దాబామీద సగం వెలుగు సగం నీడ. చింపిరి దెయ్యాల్లా ఉన్నాయి చుట్టూ ఉన్న చింత చెట్లు. చాపలమీద తప్ప మరెక్కడ పరున్నా ఒళ్ళు నొప్పులు చేస్తాయని గోలచేసే ఆ స్త్రీలు అక్కడ నోరెత్తలేదు; సమిష్టిగా గుర్రు పెడుతున్నారు.

లత చంద్రుణ్ణి చూసింది. గదిగోడని ఆనుకొని పరున్న నీడని చూసింది. నిద్రపోతున్న ఆడవాళ్ళని చూసింది. గదిలోకి చూసింది. ఉలిక్కిపడింది గడియారం గంటవిని ఒకటి, రెండు...మూడు... ఆరు...పది...పన్నెండు, అందులోనే గుండెల మీద పుస్తకంతో శేఖర్.

ఏమిటా పుస్తకం...సోమర్ సెట్ మామ్ నవల.. శేఖర్ ఉఛ్వాస నిశ్వాస తరంగాలమీద ఆ పుస్తకం ఊగుతోంది. పడుతోంది. లేస్తోంది. హృదయంమీద...హృదయానికి దగ్గరగా ... అతను పుస్తకాన్ని చదువుతూ నిద్రపోయాడు.

అతని అందాన్ని చూసినకొద్దీ ఆమె అసూయ పెరుగుతోంది. ఆమె వెనక్కితిరిగింది. హఠాత్తుగా "లతా! నిన్ను ప్రేమించాను. నిన్నే...నిన్నే... నిన్నే..." ఉలిక్కి పడింది. "ఏమిటిది? లేచి చూశాడా!"

బెదురుతూ వెనక్కుతిరిగి చూసింది. 'అమ్మయ్య లేవలేదు పలవరిస్తున్నాడు అంతే.' అలా చూస్తూ ఉండిపోయింది. అతనేదో అస్పష్టంగా గొణుగుతున్నాడు.

పసిపాపలా ప్రశాంతంగా నిద్రిస్తున్నాడు.., ఎంత ప్రశాంతత!...అమాయకత్వం. తను అలా నిద్రపోగలదా!

అతను అలా పలవరిస్తాడు. పలవరిస్తూనే ఉంటాడు. తను ఆగదిలో అలా ఉండడం...

ఆమెకళ్ళలో నీళ్లు నిలిచాయి. అతని పాదాలకు తన తలను తాకించింది. ముద్దుపెట్టుకుంది. గది బయటకు వెళ్ళిపోయింది.

* * *

తెల్లవారుతుండగా పెళ్ళి జరిగిపోయింది.

ఆమె ఎవరికీ కనబడకుండా దూరాన్నుంచే చూసింది.

మరోగంటలో తలిదండ్రులచేత ప్రయాణం కట్టించింది. ఆమె మొండిపట్టు తిరుగులేనిది... దానికి ఓటమిలేదు; ఎదురుప్రశ్న లేదు.

తను అతనికి కనపడలేదని ఆమె నమ్మకం— అదే ఆమె కోరిక. ★